నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 6 నవంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన జిల్లా నేతలు

కోదాడ, నవంబరు 5 : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జిల్లా నేతలు మంగళారం కలిశారు. ఎర్రబెల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, గాదరి కిశోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి కలిసి ఆయా నియోజకవర్గాల్లోని పరిస్థితిని వివరించారు. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల విముఖతను వివరించారు.

చెప్పేది పదించులు.. చేప పిల్లలు మూడించులే!

ఉచిత చేప పిల్లల విడుదలలో నిబంధనలకు నీళ్లు

- పెద్ద సైజ్ చేప పిల్లల స్థానంలో చిన్నవి పోస్తున్న కాంట్రాక్టర్లు
- బిల్లులు మాత్రం 'పెద్ద సైజ్'లో కొట్టేసేందుకు ప్లాన్
- రెండో రోజు నాలుగున్నర లక్షల పిల్లలకు మూడు లక్షలే విడుదల

నల్లగొండ, నవంబర్ 5 : మత్స్యకారులకు చేయూతనందిచాల్సిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకానికి కాంట్రాక్టర్లు ఆదిలోనే తూట్లు పొడుతున్నారు. నిబంధనల ప్రకారం పదించుల వరకు సైజ్ ఉన్న చేప పిల్లలనను చెరువుల్లో పోయాల్సి ఉండగా, మూడించులు ఉన్న పిల్లలనే తీసుకు వస్తున్నారు. చెరువుల్లో వదిలిన అనంతరం పది ఇంచుల చేప పిల్లలు పోసినట్లు అధికారుల ద్వారా రికార్డుల్లో రాయించుకుంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారం నల్లగొండ జిల్లాలో 2.98 కోట్ల చేప పిల్లలు పోయాల్సి ఉండగా, అందులో 2.05 కోట్లు 80 మిల్లీమీటర్ల నుంచి 100 మిల్లీమీటర్లు, 93 లక్షల పిల్లలు 30 మి.మీ. నుంచి 40 మి.మీ. ఉండాలి. క్షేత్రస్థాయిలో మాత్రం మొత్తం 30 నుంచి 40 మిల్లీమీటర్ల చేప పిల్లలనే పోస్తూ 80 నుంచి 100 మిల్లీమీటర్ల పొడవు ఉన్న చేప పిల్లలను పోస్తున్నట్లు మాయ చేస్తున్నారు.

30 మి.మీ. నుంచి 40 మి.మీ. చేప పిల్లకు ప్రభుత్వం 55 చెల్లిస్తున్నది. 80– 100 మి.మీ. చేప పిల్లకు రూ.1.47 ఇస్తుంది. జిల్లాలో మొత్తం 2.98 కోట్ల చేప పిల్లల్లో చిన్న సైజ్ చేప పిల్లలకు రూ.51.15 లక్షలు, పెద్ద సైజ్ చేప పిల్లలకు రూ.3.01కోట్లు కలిపి మొత్తం రూ.3.52 కోట్లు ఖర్చు చేస్తుంది. కాంట్రాక్టర్లు పెద్ద సైజ్ చేప పిల్లలు తీసుకొచ్చి చెరువుల్లో పోయకుండా చిన్న పిల్లలనే పోసి మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. పెద్ద చేప పిల్లల పేరుతో డబ్బును అక్రమంగా దండుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఇబ్బంది వస్తే మేం చూసుకుంటామంటూ..

చేప పిల్లల విడుదలలో కాంట్రాక్టర్లు, మత్స్య శాఖ అధికారుల మధ్య చిన్నపాటి యుద్ధమే జరుగుతుంది. జిల్లాలో ఈ ఏడాది చేప పిల్లల సరఫరాకు టెండర్లు పిలవగా నలుగురు అధికార పార్టీ కాంట్రాక్టర్లే టెండర్ వేశారు. వారికి ఫిష్ సీడ్ ఫామ్స్ లేవని రెండు సార్లు రద్దు చేయగా, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి వారికే కాంట్రాక్ట్ ఫైనల్ చేయించుకున్నారు. చేప పిల్లలను కైకలూరు నుంచి తీసుకురావడంతోపాటు పిల్లల సైజ్ విషయంలో నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని మత్స్య శాఖ యంత్రాంగం ప్రస్తావించినా నకిరేకల్, నాగార్జునసాగర్ నియోజక వర్గాలకు చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లు పెడ చెవిన పెడుతున్నారని తెలిసింది. 'ఏదైనా ఇబ్బంది వస్తే మేం చూసుకుంటాం' అంటూ బుకాయిస్తున్నారని తెలిసింది.

కాంటా వేయకుండానే పోసే ప్రయత్నం..

చెరువుల్లో చేప పిల్లలను పోయడానికి ముందు చెరువు వద్ద మత్స్యకారుల సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో కాంటా వేయాలి. కాంట్రాక్టర్ తరపున వచ్చేవాళ్లు కాంటా వేయకుండానే చెరువుల్లో వదులుతున్నారని తెలుస్తున్నది. కొన్ని చెరువుల వద్ద అధ్యక్షుడిని మేనేజ్ చేసి పోస్తుండగా, మరికొన్ని చెరువుల వద్ద సొసైటీ సభ్యులు లెక్క ప్రకారం పోయాలని పట్టుపట్టడంతో తప్పని పరిస్థితులు ఎదురవుతున్నాయి. మంగళవారం తిప్పర్తి మండలంలోని గంగన్నపాలెం, నల్లగొండ మండలంలోని అప్పాజిపేట, దోమలపల్లి గ్రామాల్లో నాలుగున్నర లక్షల చేప పిల్లలు పోయాలని అధికారులు సూచించగా కాంట్రాక్టర్ మాత్రం మూడు లక్షల పిల్లలే తీసుకొచ్చాడు. ఆయా చెరువుల వద్ద మత్స్యకారులు లెక్క ప్రకారం పోయాలని పట్టుబట్టడంతో విషయం రేపు పోస్తామని మాట దాటేశాడు. మరోవైపు ప్రతి పది కేజీల చేప పిల్లల్లో కనీసం మూడు నుంచి నాలుగు వరకు పావు కేజీ సైజ్ ఉన్న చేప పిల్లలు రావడంతో మత్స్యకారులు నష్టపోతున్నారు.

దెయ్యం చేప పిల్లలపై కలెక్టర్ సీరియస్

- కాంట్రాక్టర్‌కు నోటీస్

నల్లగొండ, నవంబర్ 5 : ఉచిత చేప పిల్లల విడుదలలో దెయ్యం చేప పిల్లలు వస్తుండడాన్ని నమస్తే తెలంగాణ దినపత్రిక మంగళవారం వెలుగులోకి తీసుకురాగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పందించారు. ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా సరఫరా చేస్తున్న చేప పిల్లల్లో దెయ్యం చేప పిల్లలు వస్తే పోసే పిల్లలతోపాటు ఇప్పటికే చెరువుల్లో ఉన్న చేపల పరిస్థితి ఏంటని మత్స్యశాఖ యంత్రాంగంపై సీరియస్ అయ్యారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. ఇకపై ఉచిత చేప పిల్లల పంపిణీలో డెవిల్ ఫిష్, క్యాట్ ఫిష్ వస్తే కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలని ఆదేశించారు. మత్స్య శాఖ స్పందిస్తూ కాంట్రాక్టర్ వెలుగు రవికి నోటీసు జారీ చేసింది.

చౌటుప్పల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

ఏదీ జీవన భృతి?

- సర్కారు తీరును నిరసిస్తూ ఆటో డ్రైవర్ల ర్యాలీ

చౌటుప్పల్, నవంబర్ 5 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లు ఆందోళనకు దిగారు. తెలంగాణ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో మహాధర్నాకు వెళ్తూ ముందుగా మండల కేంద్రంలో ఆందోళ్‌మైసమ్మ లోకల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు జీవన భృతి అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆనంతరం మహా ధర్నాకు బయల్దేరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పాండల మల్లేశ్, మానుపాటి వెంకటేశ్, బుడిద ఎట్టయ్య, కసాని కుమార్, కోళ్ల శ్రీనివాస్, బండ సంజీవ, రాచకొండ సైదులు, దేశట్ల లింగస్వామి, వెంకట్ స్వామి, ఎస్‌కే గాలీబ్, జె.మల్లయ్య, పి.చంద్రం పాల్గొన్నారు.

నీరా ప్లాంట్‌పై నిర్లక్ష్యం

నందనంలో ప్రారంభానికి నోచని నీరా కేంద్రం

- అన్నీ సిద్ధంగా ఉన్నా పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- ఏడాది కావస్తున్నా కనీసం సమీక్ష చేయని వైనం
- నాడు కేసీఆర్ హయాంలో ఏర్పాటుకు శ్రీకారం.. పూర్తి బీఆర్ఎస్‌కు పేరొస్తుందనే పట్టించుకుంటలేరనే విమర్శలు
- సీఎం పర్యటన నేపథ్యంలో ప్రారంభించాలని డిమాండ్
- అందుబాటులోకి వస్తే గీతకార్మికులకు ఉపాధి అవకాశాలు

దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించని అన్న చందంగా ఉంది నందనం నీరా ప్లాంట్ పరిస్థితి. కల్లు గీత కార్మికులకు భరోసా ఇచ్చే నీరా కేంద్రంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నా పట్టించుకోవడంలేదు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించడంతోనే అలసత్వం ప్రదర్శిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ నెల 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ఇప్పటికైనా ప్రారంభించాలని గీతన్నలు కోరుతున్నారు.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ)

భువనగిరి మండలం నందనంలో నిర్మించిన నీరా ప్లాంట్

భువనగిరి మండలంలోని నందనం గ్రామంలో నీరా ప్లాంట్ ఏర్పాటు చేయాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. గీత కార్మికులకు ఆసరాగా నిలవడంతోపాటు ప్రజలకు నీరా అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఆ మేరకు నందనంలో నాలుగు ఎకరాల్లో భవనం నిర్మించేందుకు రూ.8కోట్లు విడుదల చేసింది. 2022 జూలై 29న అప్పటి మంత్రి శ్రీనివాస్ గౌడ్, నాటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి నీరా కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గతేడాది ఆగస్టులోనే భవన నిరాణాలు పనులన్నీ పూర్తయ్యాయి. నీరా కేంద్రం నిల్వకు అవసరమైన వివిధ రకాల యంత్రాల అమర్చారు.

రేవంత్ రెడ్డి ప్రారంభించేనా?

సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 8న జిల్లాలో పర్యటించనున్నారు. తన జన్మదినం సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం రోడ్డు మార్గంలో మూసీ పరివాహక ప్రాంతానికి చేరుకుని, వలిగొండ మండలంలోని సంగెం వద్ద యాత్ర చేపట్టనున్నారు. ఆ మార్గంలోనే నందనం నీరా ప్లాంట్ ఉంటుంది. రోడ్డు మీది నుంచి చూస్తే స్పష్టంగా కనిపిస్తుంది. అదే దారిలో వెళ్తున్న రేవంత్ రెడ్డి మార్గమధ్యలో ఉన్న నీరా ప్లాంట్‌ను ప్రారంభించాలనే డిమాండ్లు వస్తున్నాయి. అందుకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చొరవ తీసుకోవాలని గీత కార్మికులు కోరుతున్నారు.

కేసీఆర్‌కు మంచి పేరొస్తుందనే పట్టించుకుంటలేరా?

1993 నవంబర్ 13న మాజీ మంత్రులు గాదె వెంకట్‌రెడ్డి, కె.జానారెడ్డి నందనంలో రూ.70లక్షల అంచనా వ్యయంతో తాటి ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ అది ముందుకు కొనసాగ లేదు. దశాబ్దాలుగా మూతబడిన నందనం తాటి ఉత్పత్తుల కేంద్రంలో నీరా ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు గత బీఆర్ఎస్ సర్కారు ముందుకు వచ్చింది. ఆరోగ్యానికి మేలు చేసే నీరా ఉత్పత్తి ద్వారా గీత వృత్తిదారులను ఆదుకోవాలని నాటి సీఎం కేసీఆర్ భావించారు. ఈ నేపథ్యంలో ప్రజలకు నీరా అందుబాటులోకి తేవాలని అనుకున్నారు. అభాగంగా తాటి వనాలు అధికంగా ఉన్న భువనగిరి మండలంలోని నందనంలో నీరా ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రారంభించడం లేదు. దీనిపై కనీసం రివ్యూ కూడా చేయలేదు. నీరా ప్లాంట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఆసక్తి చూపించడం లేదనే విమర్శలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేయడంతో ప్రారంభిస్తే.. కేసీఆర్, బీఆర్ఎస్‌కు పేరొస్తుందనే పెండింగ్‌లో పెట్టారనే ప్రచారం జరుగుతున్నది.

సేకరణ మొదలు.. స్టోరేజీ, ప్యాకింగ్, రవాణా అన్నీ ఇక్కడే..

రాష్ట్రంలోనే తొలిసారిగా నీరా ఉత్పత్తి కేంద్రం నందనంలో ఏర్పాటైంది. ఇది అందుబాటులోకి వస్తే.. నీరాను ఉదయాన్నే చెట్టు నుంచి తీసి నందనం ప్లాంట్‌కు తీసుకొస్తారు. నీరా కల్లుగా మారకుండా ఇక్కడే ప్రాసెస్ చేస్తారు. రోజూ రెండు వేల లీటర్ల నీరా కేంద్రానికి వచ్చే అవకాశం ఉంది. దాన్ని ఇక్కడే నిల్వ చేస్తారు. పులియకుండా, పాడవకుండా పాశ్చరైజేషన్ చేస్తారు. ఇక్కడి నుంచే ప్యాక్డ్ నీరాను హైదరాబాద్ కేఫ్‌తోపాటు ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తారు. సేకరణ, స్టోరేజీలు, ప్యాకింగ్, రవాణా నందనం నుంచే జరుగుతుంది. నీరా అనుబంధ ఉత్పత్తులను కూడా తయారు చేసే వీలుంటుంది. తాటి బెల్లం, చక్కెర, చాక్లెట్లు, తేనె వంటి 18రకాల వస్తువులను తయారు చేసే అవకాశం ఉంది. దాంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

ఎంజీయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ అల్వాల రవి

ఎంజీయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ అల్వాల రవికి నియామక పత్రం అందజేస్తున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

రామగిరి, నవంబర్ 5: మహాత్మా గాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా వర్సిటీలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ అల్వాల రవిని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ నియమించారు. ప్రస్తుత్తం రవి ఇన్‌చార్జీ రిజిస్ట్రార్‌గా పని చేస్తుండగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాధవి ఉత్తర్వులు జారీ చేశారు. సంవత్సర కాలంపాటు ఆయన రిజిస్ట్రార్ హోదాలో కొనసాగనున్నారు. అల్వాల రవి గతంలో ఆడిట్ సెల్ డైరెక్టర్, వీసీ ఓఎస్‌డీగానూ సేవలందించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్య గౌడ్

మూసీపై కాంగ్రెస్ మొసలి కన్నీరు

- మూసీ విధ్వంసానికి కారణమే కాంగ్రెస్ పార్టీ
- కారకులు ఎవరో బహిరంగ చర్చకు రావాలి
- గుట్టకు ఏం చేస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలి
- కేసీఆర్‌కు క్షమాపణలు చెప్పి మల్లన్నసాగర్ నీళ్లివ్వాలి
- రైతులు ఆగమైతున్నా కమీషన్లపైనే కోమటిరెడ్డి దృష్టి
- తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు కేసుల పేరుతో డ్రామాలు
- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్య గౌడ్

యాదాద్రి భువనగిరి, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : మూసీ పునరుజ్జీవంపై కాంగ్రెస్ పార్టీ ముసలి కన్నీరు కారుస్తున్నదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్య గౌడ్ విమర్శించారు. మూసీ విధ్వంసానికి కారకులు ఎవరో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. మంగళవారం భువనగిరి పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతోనే మూసీ పూర్తిగా కాలుష్యమైందని, దీనికి ఆ పార్టీనే బాధ్యత వహించాలని అన్నారు. తాము మూసీ సుందరీకరణకు మాత్రమే వ్యతిరేకమని, శుద్ధి పనులకు కాదని స్పష్టం చేశారు. రైతులను పట్టించుకోకుండా పాదయాత్రలు, సుందరీకరణ అంటూ రేవంత్ రెడ్డి ఫొటోలకు ఫోజులిస్తున్నారని దుయ్యబట్టారు. కమీషన్ల కోసం రూ.1.5లక్షల కోట్లతో మూసీ ప్రాజెక్ట్‌ను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ యాదగిరిగుట్టను అద్భుతంగా తీర్చిదిద్దారని, మిగిలిన అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు. సీఎం యాదగిరిగుట్ట పర్యటన సందర్భంగా ఆలయ అభివృద్ధికి ఏం చేస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు వృథా అని విమర్శిస్తున్న కాంగ్రెస్.. మల్లన్న సాగర్ నుంచి యాదగిరిగుట్టకు నీటికి ఎలా తీసుకొస్తున్నదని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చేసిన ఆరోపణలకు క్షమాపణలు చెప్పి కాళేశ్వరం జలాలను వినియోగించుకోవాలని డిమాండ్ చేశారు.

కోమటిరెడ్డికి కమీషన్లపైనే ధ్యాస

జిల్లాలో రైతులు ఆగమైతుంటే జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోమటి రెడ్డి ఎక్కడికి పోయారని భిక్షమయ్యగౌడ్ ప్రశ్నించారు. జిల్లాలో పాలనను పట్టించుకునే వాళ్లు కరువయ్యారన్నారు. కోమటి రెడ్డి సమస్యలను పట్టించుకోకుండా కేవలం కమీషన్లపై దృష్టి పెట్టారని ఆరోపించారు. రైతుల ధాన్యం కొంటామని ఓ వైపు చెబుతూనే.. మరోవైపు దళారులతో కుమ్మక్కైన కాంగ్రెస్ సర్కారు ధాన్యం కొనుగోళ్లు చేయకుండా జాప్యం చేస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికే సగం మంది రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్‌లో క్వింటాకు రూ.1,800కే అమ్ముకొని తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతులకు కనీస మద్దతు ధర దక్కని పరిస్థితి ఏర్పడిందన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలను టచ్ చేస్తే మసై పోతరు

రాష్ట్రంలో రైతులు చనిపోతుంటే రేవంత్‌రెడ్డికి పట్టడం లేదని భిక్షమయ్య విమర్శించారు. ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, తెలంగాణకు పట్టిన శని రేవంత్ రెడ్డి అని, ఆయన పాలనలో అన్నీ విధ్వంసాలే అని పేర్కొనానరు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా సీఎంకు చీమ కుట్టినట్లు లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 11 నెలల గడుస్తున్నా ప్రజలకు ఏమీ చేయలేదని, ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అడ్రెస్ లేవని దుయ్యబట్టారు. తప్పులను కప్పి పుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం శారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పోలీసులతో భయటపెట్టి తమ గొంతులు నొక్కలేరన్నారు. 'ఖబర్దార్.. రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ కార్యకర్తల జోలికొస్తే మాడి మసై పోతావ్' అని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మనారాయణ గౌడ్, ఓం ప్రకాశ్, ఏవీ కిరణ్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, కుతాడి సురేశ్ పాల్గొన్నారు.

'అంబుజా'ను రద్దు చేయాలి

రామన్నపేటలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

- ఆ తర్వాతే జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి అడుగు పెట్టాలి
- లేదంటే ప్రజలతో అడ్డుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, నవంబర్ 5 : ప్రజారోగ్యంతోపాటు పర్యావరణంను దెబ్బతీసే అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను రద్దు చేసిన తర్వాతే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో అడుగు పెట్టాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనకు బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకం కాదని, మూసీ ప్రక్షాళన పేరుతో ప్రజాధనాన్ని దోపిడీ చేసేందుకు జరుగుతున్న కుట్రను మాత్రం వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఈ నెల 8న మూసీ వెంట పాదయాత్రకు సిద్ధమైన సీఎం రేవంత్‌రెడ్డి రామన్నపేట వరకు వచ్చి అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై ప్రజల ఆవేదనను విని తన స్పందనను తెలియజేయాలన్నారు. పర్యటన కంటే ముందే సిమెంట్ పరిశ్రమకు అనమతులు ఇవ్వడం లేదని సీఎం ప్రకటించాలని, లేదంటే ప్రజలతో కలిసి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్ల లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నా రు. వడ్లు అమ్ముకోవడానికి రైతులు నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని తెలిపారు. ఆయ న వెంట బీఆర్ఎస్ నాయకులు పోచబోయిన మల్లేశం, బందెల రాములు, వేమవరం సుధీర్‌బాబు, గొరిగె నర్సింహ, సాల్వేరు అశోక్, బాలగోని నర్సింహ, ఎండీ ఆమేర్, జాడ సంతోశ్, బద్దుల రమేశ్, మి ర్యాల మల్లేశం, ఎండీ ఎజాజ్, లవనం రా ము, మోటె రవీందర్, ఆవుల శ్రీధర్, బుర్ర శ్రీశైలం, బొడ్డుపల్లి రాజు, గుర్జాల సంజీవ రెడ్డి, నల్ల సైదులు, కొండగడప చింటు, బాసాని రాజు, మోసబ్, తీర్పాల శ్రీను, నర్సింహ, వెంకటేశ్ ఉన్నారు.

తెలంగాణ హాకీ జట్టు కోచ్‌గా నల్లగొండ వాసి

తడక కిరణ్‌ప్రసాద్

రామగిరి, నవంబర్ 5: హాకీ ఇండియా సీనియర్ పురుషుల జాతీయ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టు కోచ్‌గా నల్లగొండకు చెందిన తడక కిరణ్‌ప్రసాద్ ఎంపికయ్యారు. చెన్నైలో ఈ నెల 4 నుంచి 15 వరకు జరిగే హాకీ ఇండియా సీనియర్ పురుషుల జాతీయ చాంపియన్ షిప్ పోటీలకు ఆయన కోచ్‌గా వ్యహరిస్తారు. తడక కిరణ్‌ప్రసాద్ ప్రస్తుతం ఇండియన్ ఆర్మీ హాకీ టీం కోచ్‌గా వ్యహరిస్తున్నారు.

నల్లమలలో వన్యప్రాణుల సందడి

- గణనీయంగా పెరిగిన జంతువుల సంఖ్య
- తాజాగా ట్రాప్ కెమెరాల్లో ఆరు చిరుతల గుర్తింపు

ట్రాప్ కెమెరాలో కనిపించిన చిరుత పులి

చందంపేట, నవంబర్ 5 : నల్లమల అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నది. జంతువుల సంరక్షణకు అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, తీసుకుంటున్న జాగ్రత్తలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. నల్లమలలో మొక్కలను విపరీతంగా పెంచడంతోపాటు బయటి వ్యక్తులు ప్రవేశించకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. వన్య ప్రాణులు దాహార్తిని తీర్చుకునేందుకు 110 సాసర్ పిట్స్ ఏర్పాటు చేశారు. దప్పిక తీర్చుకునేందుకు వచ్చే జంతువులను గుర్తించేందుకు 120 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. వారంలో ఒకసారి జంతువులను గుర్తించడంతో పాటు కొత్త జంతువులేవైనా అటవీలోకి ప్రవేశించాయా అనేది నిర్ధారించుకుంటున్నారు. ప్రస్తుతం నల్లమల అటవీ ప్రాంతంలో చిరుత పులులు 6, మనుబోతులు 118, పందులు, ముళ్ల పందులు, సాంబార్, నెమళ్లు, జింకలు 476 ఉన్నట్లు కంబాలపల్లి రేంజ్ ఆఫీసర్ భాస్కర్ తెలిపారు. అటవీ ప్రాంతంలోని కంబాలపల్లి, పాత కంబాలపల్లి, రేకులవలయం, గుంతలతండా, సర్కిల్‌తండా, చిత్రియాల, పెద్ద మూల, రేకులగడ్డ, నల్లమల అటవీ ప్రాంతంలో సుమారు 45 చెక్ డ్యామ్‌లు, 16 మినీ చెక్ డ్యాములు నిర్మించి నీటిని నిల్వ చేయడంతో అటవీ జంతువుల దాహార్తిని తీర్చుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. వన్య ప్రాణులకు ఎవరూ ఇబ్బంది కలిగించకుండా బీట్ ఆఫీసర్లు వాచ్ టవర్లపై నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. హరిత హారంలో నాటిన మొక్కలు పెరుగుడంతో నల్లమల దట్టమైన అటవీ ప్రాంతంగా మారుతున్నది భాస్కర్ పేర్కొన్నారు.